బ్రహ్మసూత్రములు

ॐ

బ్రహ్మసూత్రములు పఠించేముందు చదివే

శాంతి మంత్రములు

ఓం శం నో మిత్రః శం వరుణః. శం నో భవత్వర్యమా. శం న ఇంద్రో బృహస్పతిః. శం నో విష్ణురురుక్రమః. నమో బ్రహ్మణే. నమస్తే వాయో. త్వమేవ ప్రత్యక్షం బ్రహ్మాసి. త్వామేవ ప్రత్యక్షం బ్రహ్మ వదిష్యామి. ఋతం వదిష్యామి. సత్యం వదిష్యామి. తన్మామవతు. తద్వక్తారమవతు. అవతుమామ్. అవతు వక్తారమ్. ఓం శాంతిః శాంతిః శాంతిః ॥

సహ నావవతు, సహ నౌ భునక్తు, సహ వీర్యం కరవావహై, తేజస్వి నావధీతమస్తు, మా విద్విషావహై. ఓం శాంతిః శాంతిః శాంతిః ॥

యశ్ఛందసామృషభో విశ్వరూపః. ఛందోభ్యోఽధ్యమృతాత్సంబభూవ. స మేంద్రో మేధయా స్పృణోతు. అమృతస్య దేవధారణో భూయాసమ్. శరీరం మే విచర్షణమ్. జిహ్వా మే మధుమత్తమా. కర్ణాభ్యాం భూరి విశ్రువమ్. బ్రహ్మణః కోశోఽసి మేధయా పిహితః. శ్రుతం మే గోపాయ. ఓం శాంతిః శాంతిః శాంతిః ॥

అహం వృక్షస్యరేరివా. కీర్తిః పృష్ఠం గిరేరివ. ఊర్ధ్వ పవిత్రో వాజినీవ స్వమృత మస్మి. ద్రవిణగ్ం సవర్చసమ్. సుమేధా అమృతోఽక్షితః. ఇతి త్రిశంకోర్వేదాను వచనమ్. ఓం శాంతిః శాంతిః శాంతిః ॥

ఉపోద్ఘాతము

"వేదాః అనంతాః" వేద వాఙ్మయము అపారము. అపౌరుషేయములుగా భారతీయులు శ్రద్ధాభక్తులతో యుగయుగాల నుండి కాపాడుకుంటున్న అమూల్య సంపద. వేదములు నిత్యములు. వేదవాక్కులు తేజోమయములు. కాలగర్భంలో కలిసిపోకుండా నాశరహితముగా ఉన్న సత్యస్రవంతులు. వేదములలోని పూర్వమంత్ర భాగమును సంహితలుగాను, చివర భాగములను ఆరణ్యకములు (ఉపనిషత్తులు) గాను సామాన్యంగా పరిగణిస్తారు. అయితే, కొన్ని సంహితాభాగాలు కూడా ఉపనిషత్తులుగా వ్యాప్తిలోకి వచ్చాయి (ఉదాహరణకు ఈశావాస్యోపనిషత్తు). సంహితా భాగాలు కర్మకాండకు విధివిధానములు నిర్దేశించగా, అంత్యభాగములు గుహ్యమైన వేదాంతబోధకు ప్రత్యేకింపబడినవి.

శ్రుతి వాక్యములు ధర్మార్థకామమోక్షములను పురుషార్థములుగా నిర్దేశించి; ప్రవృత్తిమార్గము, నివృత్తి మార్గము – అను రెండు వేరు వేరు మార్గాలను జీవనయాత్ర కొనసాగించుకోటానికి ఉపయుక్తములుగా సూచించినవి. ప్రవృత్తి మార్గాన్ని ధర్మార్థకామాపేక్షలున్న వారికి అనుగుణ్యమని సూచిస్తూ, ఐహిక, స్వర్గభోగాలకు, శాస్త్ర సమ్మతమైన కర్మాచరణకు, నిత్యనైమిత్తిక కర్మలను, ఇష్టాపూర్తాది సత్కార్యములను ఎన్నో, ఎన్నెన్నో పేర్కొనడమైనది. వీటి విషయమై సంహితా భాగాలపై ఆధారితమైన పూర్వమీమాంసా ధర్మశాస్త్రాలలో విస్తృతంగా ప్రస్తావించటం జరిగింది.

ఇకపోతే, పరమోత్కృష్ట మార్గంగా బోధింపబడినది మోక్షమార్గము. "జ్ఞానాదేవ తు కైవల్యం" అని సంసారబంధ విముక్తికి, జనన–మరణ దుఃఖము లేని బ్రహ్మప్రాప్తికి జ్ఞానము అనివార్యమని ఉపనిషత్తులు వక్కాణించాయి. పరావిద్యగా

1. సమన్వయాధ్యాయము : ప్రథమపాదము

1. జిజ్ఞాసాధికరణమ్

సూ: 1.1.1 అథాతో బ్రహ్మజిజ్ఞాసా

పూర్వపక్షి సంశయం:

విధిపరమైన వేదభాగాలన్నీ పూర్వమీమాంసా శాస్త్రంలో పరిశీలించబడ్డాయి కదా! ఆ శాస్త్రానికి, ఉత్తరమీమాంసా శాస్త్రానికి ఎటువంటి భేదముంది?

సమాధానం:

పూర్వమీమాంసా శాస్త్రము కర్మాచరణకు విధిరూపమైన వేదభాగాన్నే విచారించింది కాని, నిత్యసిద్ధమైన బ్రహ్మతత్త్వాన్ని విచారణ చేయలేదు. పూర్వ మీమాంసా శాస్త్రం ధర్మాధర్మాల విచారణకు పరిమితం. ఉపనిషద్వాక్యాలను పరమాత్మయైన నిర్గుణబ్రహ్మను సమన్వయించుకొని అర్థంచేసుకోవాలి. "*సర్వేషాం వేదాంత వాక్యానాం అద్వితీయే బ్రహ్మణి నిర్విశేషే తాత్పర్యమితి*" అనేదే ఉత్తరమీమాంసా శాస్త్రము యొక్క ముఖ్య లక్ష్యము.

సంశయం:

జైమిన్యాచార్యులవారి ధర్మసూత్రాలు "*అథాతో ధర్మ జిజ్ఞాసా*" అనే సూత్రంతో మొదలయ్యాయి. అక్కడ 'అథ'–'అతః' అనే పదాలకు వేదాధ్యయనము పూర్తిచేసుకొన్న తరవాత ధర్మజిజ్ఞాసా అని అర్థం చెప్పారు. వేదాధ్యయనం, కర్మవిధి తెలిసికొన్న తరవాతనే బ్రహ్మజిజ్ఞాస ప్రారంభించాలనే నిర్దేశము ఏమైనా ఉందా?

సమాధానం:

బ్రహ్మసూత్రములు బ్రహ్మపదార్థము, పరమాత్మ యొక్క జిజ్ఞాసలనుద్దేశించి ప్రతిపాదింపబడినవి. వేదాంతములలో చెప్పబడిన బ్రహ్మతత్త్వము, తత్ జ్ఞానప్రాప్తికి సంబంధించిన విద్యావిషయములు, కర్మకాండకు సంబంధించిన వేదము యొక్క పూర్వభాగములో లేవు. అందువల్ల వేదాధ్యయనము, కర్మ సంబంధిత అవగాహన ఉంటేనే కాని బ్రహ్మజిజ్ఞాస చేసుకోబడదు అనేవాదన సమంజసము కాదు.

"*అథాతో బ్రహ్మజిజ్ఞాసా*" అనే సూత్రంలో ఉన్నటువంటి 'అథ' శబ్దాన్ని, మంగళ వాచకంగా అన్వయించుకోవాలి. "*ఓంకారశ్చ అథశబ్దశ్చ ద్వావేతౌ బ్రహ్మణః పురా కంఠం భిత్త్వా వినిర్యాతౌ తస్మాన్మాంగలికావుభౌ*" (ఓంకారము, అథ శబ్దము బ్రహ్మదేవుని నోటి నుండి ముందుగా వెలువడినవి. అందువల్ల ఆ రెండు పదములు సహజంగా మంగళదాయకములు). సరియైన అధికారం ఉన్న వ్యక్తికి కర్మజిజ్ఞాస లేకుండానే బ్రహ్మజిజ్ఞాస, మోక్షేచ్ఛ కలగవచ్చు.

సంశయం:

యథాశాస్త్రం వేదపఠనం చేసి, వివాహం చేసుకొని, శక్త్యానుసారం యజ్ఞ యాగాలు చేసిన తరవాతనే నివృత్తి మార్గంలో మనస్సును లగ్నం చేసుకొని మోక్ష మార్గంలో, బుద్ధిని స్థిరీకరించుకోవాలని స్మృతులు వక్కాణిస్తున్నాయి. అదీకాక "*బ్రహ్మచర్యం సమాప్య గృహీ భవేత్, గృహాత్ వనీభూత్వా ప్రవ్రజేత్*" (బ్రహ్మచర్యావస్థ పూర్తి చేసుకొని, గృహస్థుడై ఆ తరవాత వానప్రస్థాశ్రమం స్వీకరించి, తదనంతరము సన్యాసాశ్రమము) అనేది శ్రుతి వచనం. స్మృతి వచనానుసారం యథాశాస్త్రంగా వేదాధ్యయనం చేసి, ధర్మాన్ని పాటిస్తూ పుత్రులను కని, శక్తికి తగిన యజ్ఞయాగాదులు చేసిన తరవాత మనస్సును మోక్షమార్గంలో నిలుపుకోవాలి. (*"అధీత్య విధివద్వేదాన్ పుత్రాంశ్చోత్పాద్య ధర్మతః ఇష్ట్వా చ శక్తితో యజ్ఞైర్మనో మోక్షే నివేశయేత్"*).

ఈ విధంగా స్మృతి వచనాలు వినబడుతున్నప్పుడు నిర్దిష్టక్రమంలో బ్రహ్మ జిజ్ఞాస ప్రారంభించటం యుక్తం కదా?

సమాధానం:

బ్రహ్మజిజ్ఞాసకు ఎట్టి అవస్థాక్రమ నిర్ణయము లేదు. చిత్తశుద్ధి ఉన్న వానికి కర్మల ప్రమేయమే లేదు. "*బ్రహ్మచర్యాదేవ ప్రవ్రజేత్*" (బ్రహ్మచర్యాశ్రమం నుంచే సన్న్యాసాశ్రమానికి వెళ్లవచ్చును). అలాగే శ్రుతిలో "*యదహరేవ విరజేత్ తదహరేవ ప్రవ్రజేత్*" (వైరాగ్య భావన వచ్చిననాడే సన్యసించ వచ్చును) అని చెప్పబడింది.

1. సమన్వయాధ్యాయం - ద్వితీయపాదము

1. సర్వత్ర ప్రసిద్ధ్యాధికరణమ్

ఈ పాదంలో చాలా వరకు సగుణ బ్రహ్మోపాసనకు సంబంధించిన బోధన వాక్యాలు ప్రతిపాదింపబడ్డాయి. బ్రహ్మమును నిర్దేశించే లింగాలు కూడా స్పష్టంగా కాకుండా సందేహాస్పదంగా పరోక్షంగానే చెప్పబడ్డా, అవీ బ్రహ్మనే సూచిస్తున్నాయి అని నిర్ణయించబడింది.

సూ: 1.2.1 సర్వత్ర ప్రసిద్ధోపదేశాత్

పూర్వపక్షి:

ఛాందోగ్యోపనిషత్తులో శాండిల్యవిద్యా ప్రకరణంలో బ్రహ్మోపాసన గురించి చెప్పిన శ్రుతి ఇలా ఉంది: "*సర్వం ఖల్విదం బ్రహ్మ తజ్జలానితి శాంత ఉపాసీత అథ ఖలు క్రతుమయ: పురుషో యథా క్రతురస్మిన్ లోకే పురుషో భవతి తథేతః ప్రేత్య భవతి. స క్రతుం కుర్వీత మనోమయః ప్రాణశరీరో భారూపః*" [సమస్త ప్రపంచమూ సృష్టికాలములో బ్రహ్మస్వరూపమందే పుట్టినది. ఆ బ్రహ్మయందే అంతా లీన మవుతున్నది. జీవించియున్న స్థితి సమయములో దాని శక్తి చేతనే నడుపబడుచున్నది. అందువల్ల బ్రహ్మమును శాంతముతో (శమదమాది సంపత్తులతో) ఉపాసించవలెను. జీవుడు (పురుషుడు) సంకల్ప స్వభావుడు. ఈ లోకంలో ఎలాటి సంకల్పం (కోరిక) ఉన్నవాడో పరలోకానికి వెళ్లిన తరువాత కూడా అట్టి సంకల్పం కలవాడే అవుతాడు. అందువల్ల ఆ బ్రహ్మను మనోమయమని, ముఖ్యప్రాణమే శరీరముగా కలిగినదని, స్వయం ప్రకాశరూపమని మనస్సులో ధ్యానించాలి - ఛా.ఉ 3.14.2] ఈ శ్రుతిలో

శరీరుడుకి సంబంధించిన లింగాలు చాలా కనబడుతున్నాయి. సంకల్పం, మనో-మయత్వాది ధర్మాలు ఉండటం వల్ల జీవాత్మ చెప్పబడుతున్నట్లు వ్యక్తమౌతున్నది. అంతేకాదు *"ఏష మ అంతర్హృదయేఽణీయాన్ వ్రీహేర్వా, యవాద్వా"*(శరీరుడి హృదయంలో ఉన్న జీవాత్మ సూక్ష్మాతి సూక్ష్మమైనది, చిన్న విత్తనం గింజలా పరిమిత మైనది) అని చెప్పడం వల్ల ఇక్కడ జీవాత్మ ఉపాసనయే చెప్పబడుతున్నది.

సిద్ధాంతం:

"సర్వం ఖల్విదం బ్రహ్మ" అనేది అన్ని వేదాంతాలలో ప్రసిద్ధమైన జగత్కారణ రూపమైన బ్రహ్మమునే నిర్దేశిస్తున్నది. మనోమయత్వాది ధర్మాలు, బ్రహ్మ ఉపాసన కొరకు వివరించబడ్డాయి. జగత్కర్త అయిన బ్రహ్మము *"మనోమయః, ప్రాణశరీరః, భారూపః"* అని చెప్పబడింది. సత్యసంకల్పం అనే గుణము బ్రహ్మముకు తప్ప జీవుడికి కుదరదు.

సూ: 1.2.2 వివక్షితగుణోపపత్తేశ్చ

ఒక వ్యక్తి తను చెప్పినది వినేవారు గ్రహించాలి అని భావిస్తే అది వివక్షితం (వక్తు మిష్టాః వివక్షితాః) అని చెప్పవచ్చు. కాని, వేదం అపౌరుషేయం (వక్త లేనిది), కాబట్టి వివక్షితం ఉండదు. కాని వేద వాక్యాలలో కొన్ని ఉపాదేయం, గ్రహించాలి అనే భావనతో చెప్పినవి. వాటిని వివక్షితంగా స్వీకరిస్తూ, ఏవి అవివక్షితమో (గ్రహించకుండా వదిలేయ బడేవి), వాటిని తాత్పర్యం లేనివాటిగా భావించి, ప్రక్కన పెట్టటం జరుగుతుంది.

ఈ ప్రకరణంలో *'సత్యసంకల్పః'* అనేది బ్రహ్మోపాసనకు ఉపాదేయంగానే చెప్పబడింది. బ్రహ్మమునకే సంకల్పించిందల్లా సత్ అవడం కుదురుతుంది. *"య అపహతపాప్మా"* (దోషరహితుడు), *"జ్యాయాన్ పృథివీ"* (పృథివి కన్నా పెద్దవాడు), *"ఆకాశ ఆత్మా"* (ఆకాశంలా సర్వవ్యాపి) ఇట్లాంటి విశిష్ట గుణాలు వివక్షితములు. అవి బ్రహ్మమునకే వర్తిస్తాయి.

"మనోమయ ప్రాణశరీరః" అనేది జీవలింగాన్నే సూచిస్తున్నట్లు ఆక్షేపింప బడింది. బ్రహ్మము సర్వాత్మకం కాబట్టి జీవగుణాలు చెప్పినా తప్పులేదు. ఉపనిషత్ వాక్యాలు ఇలా చెప్పటాన్ని సమర్థిస్తున్నాయి. *"త్వం స్త్రీ త్వం పూమానసి, త్వం కుమార ఉత కుమారీ, త్వం జీర్ణో దండేన వంచసి, త్వం జాతో భవసి, విశ్వతో*

1. సమన్వయాధ్యాయము - తృతీయపాదము

1. ద్యుభ్వాద్యధికరణమ్

సూ: 1.3.1 ద్యుభ్వాద్యాయతనం స్వశబ్దాత్

ఈ పాదంలో ముఖ్యంగా జ్ఞేయమైన నిర్గుణబ్రహ్మ ప్రతిపాదన చెయ్యబడింది. శౌనకుడు–ఆంగిరసునకు చేసిన పరావిద్యా బోధన ప్రకరణంలో శ్రుతి ఇలా వినబడుతున్నది. *"యస్మిన్ ద్యౌః పృథివీచ అంతరిక్షం ఓతం మనః సహ ప్రాణైశ్చ సర్వైః తమేవ ఏకం జానథ ఆత్మానం అన్యా వాచో విముంచథ అమృతస్య ఏష సేతుః"* [దేనియందు ద్యులోకం పృథివీ అంతరిక్షం సమస్త ప్రాణాలతో సహా మనస్సు పెనవేసికొని (అల్లుకొని) ఉన్నాయో అది ఒక్కటే ఆత్మ అని తెలుసుకోవాలి. మిగతా మాటలు అనవసరం. ఆత్మయే అమృతత్వానికి సేతువు - ము.ఉ 2.2-5].

పూర్వపక్షి :

ద్యులోకాదులు అల్లుకొని ఉన్నాయి అంటే వాటికి ఆయతనంగా (ముఖ్య స్థానం) మరొకటి ఏదో ఉందని, అనిపిస్తున్నది. అలాగే "అమృతస్య ఏష సేతుః" అంటే ఆ వారధికి అవతల ఒడ్డు ఉన్నట్లే కదా? బ్రహ్మ అనంతం (అపారం) అన్న శ్రుత్యనుసారం సేతువులా వ్యవహరించటానికి మరో ఒడ్డు చేరితే వేరొకటి ఉండరాదు. అందువల్ల ఇక్కడ చెబుతున్నది వాయువైనా కావాలి, లేకపోతే స్మృతిలో చెప్పబడిన ప్రధానమైనా కావాలి. *"వాయుర్వై గౌతమ తత్సూత్రం వాయునా వై గౌతమ సూత్రేణ*

అయం చ లోకః పరశ్చలోకః సర్వాణి భూతాని సంధృబ్ధాని భవంతి" [ఓ గౌతమా! వాయువు చేతనే ఇహ-పరలోకములు, సమస్త భూతములు ఒకే దారంతో గ్రుచ్చబడిన మాలలాగ కట్టబడి (నిలబెట్టబడి) ఉన్నాయి - బృ.ఉ 3.7.2] అని ఇలా యాజ్ఞవల్క్య, ఆరుణి సంవాదంలో చెప్పబడింది. ఆయతనం జగత్తంతటికి ఒక్కటే అని సూచింపబడింది కాబట్టి, ఇక్కడ జీవుడి యొక్క అన్వయం కుదరవచ్చు అని కూడ తోస్తున్నది.

సిద్ధాంతం :

"తమేవ ఏకం జానథ ఆత్మానమ్" అని ఆత్మశబ్ద నిర్దేశం ఉండటం వల్ల పరమాత్మను ఉద్దేశించే ఇక్కడ ఉపదేశం జరిగింది అని వ్యక్తమౌతున్నది. *"సన్మూలాః సోమ్య ఇమాః ప్రజాః సదాయతనాః సత్ప్రతిష్ఠాః"* [యావన్మంది ప్రజలకు సత్ ఆయతనము (మూలము), సత్ వల్లే జీవిస్తున్నారు సత్ లోనే విలీనమౌతున్నారు - ఛా. ఉ 6.8.4] అని ఛాందోగ్యోపనిషత్తులో నిర్దిష్టంగా బ్రహ్మమును బోధించే సత్ శబ్దం ఆయతనంగా చెప్పబడింది. *"తమేవ ఏకం జానథ ఆత్మానమ్"* అనే శ్రుతికి ముందూ, తదనంతరము కూడా పరమాత్మ యొక్క ఉపదేశమే చేయబడింది. *"పురుష ఏ వేదం విశ్వం కర్మ తపో బ్రహ్మ పరామృతమ్"* (జ్ఞాన కర్మల ఫలరూపమైన ఈ జగత్తుకు కారణము ఆ పురుషుడే. అదే పరమూ, అమృతమైన బ్రహ్మము - ము.ఉ 2.1.10). *"బ్రహ్మ ఏవ ఇదం అమృతం పురస్తాత్, బ్రహ్మ పశ్చాత్, బ్రహ్మ దక్షిణశ్చ ఉత్తరేణ అధశ్చ ఉర్ధ్వం చ"* (అన్ని దిక్కులందు బ్రహ్మ వ్యాపించి ఉన్నాడు - ము.ఉ 2.2.11). అంతా బ్రహ్మమే అనే భావనతో చెప్పబడింది కాబట్టి, నిర్విశేష (నిర్గుణ) బ్రహ్మ నిర్దేశము జరిగినట్లు గ్రహించాలి.

ఏకరసమైనది, అద్వితీయమైన నిర్గుణ బ్రహ్మ ఉపదేశమే ఛాందోగ్యంలోను శ్వేతకేతువునకు ఉద్దాలకుడు చేశాడు. అందువల్ల *"తమేవ ఏకం జానథ ఆత్మానమ్"* అనే వాక్యంలో ఉన్నది నిర్విశేష బ్రహ్మ నిర్దేశమనే గ్రహించాలి. ఆత్మయందు నానాత్వం (భిన్న భావంతో) ఎవడు చూస్తాడో వాడు మృత్యువు నుండి - మృత్యువునే పొందును, వానికి జనన-మరణ వలయం నుండి విముక్తి ఉండదని కఠోపనిషత్తులో కూడా చెప్పబడింది. *"మృత్యోః స మృత్యు మాప్నోతి య ఇహ నానా ఇవ పశ్యతి"* (కఠ 2.4.4). యాజ్ఞవల్క్యుడు, మైత్రేయికి ఆత్మబోధన చేసిన సందర్భంలో ఇలా అంటాడు: *"స యథా సైంధవఘనోఽనన్తరోఽబాహ్యః కృత్స్నః రసఘన ఏవ, ఏవం వా అరే! అయమాత్మానన్తరోఽబాహ్యః కృత్స్నః ప్రజ్ఞానఘన ఏవ"* [సైంధవ లవణ

1. ప్రథమాధ్యాయము - చతుర్థపాదము

1. అనుమానికాధికరణమ్

సూ: 1.4.1 అనుమానికమప్యేకేషామితి చేన్న శరీరరూపకవిన్యస్తగృహీతేర్దర్శయతి చ

(అనుమానికమపి ఏకేషాం ఇతి చేత్ న శరీరరూపక విన్యస్త గృహీతేః దర్శయతి చ)

బ్రహ్మము యొక్క లక్షణం ఈ అధ్యాయం రెండవ సూత్రంలో *"జన్మాద్యస్య యతః"* (బ్ర.సూ 1.1.2) యందు చెప్పడమైనది. అయితే ఆ లక్షణం సాంఖ్యమతస్థులు ప్రతిపాదించిన ప్రధానమునకు కూడా వర్తించగలదని ఆక్షేపించబడగా *"ఈక్షతేర్నా శబ్దమ్"* (బ్ర.సూ 1.1.5) అనే సూత్రంలో ప్రధానము జగత్కారణం కాజాలదని తిరస్కరించబడింది. అయినా శ్రుతి-స్మృతుల ప్రామాణ్యం విశ్వసిస్తున్న కొందరు వేదశాఖీయులు ప్రధానము జగత్ సృష్టి-స్థితి-లయములకు కారణము కావచ్చునని నమ్ముతున్నారు. వారిలో కపిలాది మహర్షులు కొన్ని శ్రుతి-స్మృతి వాక్యాలను ఉదహరిస్తూ ప్రధానమునకు సమాన శబ్దాలను కూడా చూపించారు. అయితే వీరి వాదన సర్వజ్ఞమైన బ్రహ్మము (పరమాత్మ) జగత్కారణమనే వేదాంత మూల ప్రాతిపదకకు విరుద్ధమవుతుంది. అంతేకాక, వేదములన్నింటిలోను ఒకే రీతిలో గమనం, గతి సామాన్యం ఉంది. ప్రధానం విషయంలో మాత్రం గమనంలో భేదం కనబడుతున్నది. ఈ పాదంలో అటువంటి అస్పష్టతను నిర్మూలించటానికే కొన్ని

శ్రుతి-స్మృతి శబ్దాల పరిశీలన చేసి అద్వైత సిద్ధాంతాన్ని నిర్ణయించటం, సందేహాలను నివృత్తి చేయటం జరిగింది.

పూర్వపక్షి :

కఠోపనిషత్తులో *"మహతః పరమవ్యక్తం అవ్యక్తాత్ పురుషః పరః"* (క.ఉ 1.3.11) అని శ్రుతి వినబడుతున్నది. 'మహత్', 'అవ్యక్తమ్' అనే పదాలు సాంఖ్య ప్రతిపాదిత ప్రధానంలో కూడా అదే క్రమంలోనే చెప్పబడ్డాయి. అందువల్ల, 'అవ్యక్తం' బ్రహ్మప్రతిపాదనా లేక ప్రధాన ప్రతిపాదనా? అవ్యక్తం ప్రధాన నిర్దేశమా లేక శరీర సంబంధమైన మరి దేనినైనా సూచిస్తున్నదా?

సిద్ధాంతం :

కఠోపనిషత్తులో పైన ఉదహరించిన అవ్యక్త శబ్దం ఎంత మాత్రము సాంఖ్య స్మృతులలో చెప్పబడిన త్రిగుణాత్మకమైన ప్రధానమునకు వర్తించదు. "న వ్యక్తం అవ్యక్తమ్" (వ్యక్తము కానిది అవ్యక్తము) అంటే ప్రధానము తప్ప మరొకటి కాదు అనే వాదన సమంజసము అసలు కాదు. 'అవ్యక్తం' అనే పదము సాంఖ్యులు ఎన్నుకున్న ఒక సాంకేతిక పదము అనే గ్రహించాలి. వారి సిద్ధాంతంలో అది త్రిగుణాత్మకమైనది. సత్వరజస్తమోగుణాల సమన్వయం. అవ్యక్తం అనేది సూక్ష్మమైనది, చూడశక్యము కానిది అనే భావనలో యౌగిక శబ్దంగా ఎక్కడైనా వాడవచ్చు. సాంఖ్యులకు ప్రధానము అవ్యక్తము అనే రూఢ్యర్థం ఉండవచ్చు. కాని, అన్ని శాఖల వారికీ అందరి దార్శనికులకూ అదే రూఢ్యర్థం (భావన) ఉండాలనే నియమం లేదు. కఠోపనిషత్తులో ప్రకరణ సందర్భం పరిశీలిస్తే ఈ విషయం స్పష్టమవుతుంది. జీవాత్మ శరీరాలకు రథికుడు, శరీరం ఒక రథం అనే కల్పనతో శ్రుతి ఇలా వినబడు తున్నది: *"ఆత్మానం రథినం విద్ధి శరీరం రథమేవతు, బుద్ధింతు సారథిం విద్ధి మనః ప్రగ్రహ మేవచ"* (క.ఉ 1.3.3). ఆ తరవాత *"ఇంద్రయాణి హయాన్ ఆహుః విషయాం స్తేషు గోచరాన్ ఆత్మేంద్రియ మనో యుక్తం భోక్తేతి ఆహుర్మనీషిణః"* [ఆత్మ రథికుడని తెలుసుకో, శరీరమే రథము. బుద్ధి రథసారథి. మనస్సు కళ్ళెము. ఇంద్రియములు గుఱ్ఱములు. కోరికలను తీర్చేది ఆ గుఱ్ఱములే. శరీర-ఇంద్రియ-మనస్సులతో సంయుక్తమైన నువ్వే (ఆత్మయే) భోక్త అని ధీమంతులు చెప్తున్నారు - క.ఉ 1.3.4].

ఇంద్రియాలను వశంలో ఉంచుకోలేని వాడు సంసారబంధంలో పడి సుఖ దుఃఖాలను అనుభవిస్తాడు. ఇంద్రియాలను, కోరికలను నిగ్రహించుకునే వ్యక్తి,

2. అవిరోధాధ్యాయము : ప్రథమపాదము

ప్రథమాధ్యాయంలో సర్వజ్ఞుడైన పరబ్రహ్మమే జగత్కారణమని, సర్వప్రాణుల సృష్టి–స్థితి–లయములకు పరమాత్మ మూలమని అతడే సర్వాధ్యక్షుడని, అతని ఆధీనంలో ప్రపంచములో సర్వమూ నిర్వహించబడుతున్నదని ప్రస్తావించడమైనది. వేదాంత వాక్యాల ప్రమాణంతోను, వేద సారాంశమైన భగవద్గీతాది బోధనల యొక్క సమన్వయంతోను సర్వేశ్వరుడే అందరికి ఆత్మస్వరూపమని ప్రతిపాదించబడింది.

ఈ అధ్యాయంలో స్మృతికారులతో కాని, తార్కికులతో కాని వేదవిహితమైన పరమాత్మ తత్త్వాన్ని, విభూతిని అంగీకరించడంలో విరోధమేమీ లేదని స్థాపించబడుతున్నది. ప్రస్తుతము ఈ అధ్యాయ ప్రథమపాదంలో కపిలముని తన తంత్రగ్రంథంలో ప్రతిపాదించిన అంశాలను పరిశీలించి, వారి మతం ఎంతవరకు శాస్త్రసమ్మతమో, శాస్త్రవిరుద్ధమైన స్మృతి వచనాలను ఎందుకు నిరాకరించవలసి ఉందో విస్తృతంగా చర్చింపబడుతున్నది.

1. స్మృత్యధికరణమ్

సూ: 2.1.1 స్మృత్యనవకాశదోషప్రసంగ ఇతి చేన్నాన్య స్మృత్యనవకాశదోషప్రసంగాత్

సాంఖ్య స్మృతికి ఈ పరిశీలనలో అవకాశం కల్పించకపోవటం దోషం అంటే అప్పుడు మిగతా స్మృతులను పరిత్యజించి వాటికి అవకాశం కల్పించలేదనే దోషం వస్తుందని సూత్రార్థం.

సాంఖ్యశాస్త్రాన్ని పరమర్షి కపిలుడు తంత్రమనే పేరుతో రచించి సమ్యక్ జ్ఞానంతో మోక్షప్రాప్తి పొందవచ్చునని ప్రతిపాదించాడు. వేద ప్రామాణ్యాన్ని తిరస్కరించకుండా, అగ్నిహోత్రాది అనుష్ఠానక్రియలు, వర్ణాశ్రమాది విధ్యుక్త ధర్మాలను వ్యతిరేకించటం వల్ల కపిలతంత్రం (కపిలస్మృతి) ప్రత్యేక స్థానాన్ని సంతరించుకుంది. నాస్తిక వాదులు కాకపోయినా, కపిలముని వారి అనుచరులు ఈశ్వర అస్తిత్వాన్ని, బ్రహ్మమొక్కటే అని అంగీకరించలేదు. సాంఖ్యమతం ప్రకృతి–పురుషుడు లేక జీవుడు అని రెండు మూలతత్త్వాలను ప్రస్తావించింది. ప్రకృతి జడం అచేతనమైనది. జీవుడు చైతన్యరూపుడు. ప్రపంచ వ్యవహారాలన్నిటిని సాక్షిగా పురుషుడు చూస్తూ ఉంటూ, ప్రకృతి ప్రాపంచిక వ్యవహారాలను నడుపుతూ ఉంటే, వాటిని అనుభవిస్తాడు కాని వాటికి కర్త కాదు. దేహాలు వేరు కాబట్టి జీవులు (ఆత్మలూ) వేరువేరుగానే ఉండాలి. ఇది సర్వాత్మకత్వానికి విరుద్ధం.

కపిలమతాన్ని మిగతా స్మృతికారులైన మనువు, ఆపస్తంబుడు, గౌతముడు ఇత్యాదులు వ్యతిరేకించారు, నిందించారు కూడా.

పూర్వపక్షి:

కపిలమునికి ఆర్షజ్ఞానం, వేదములపై బహు ఆదరణ ఉందనే ఈశ్వర వాదులు విశ్వసిస్తారు. శ్రుతిలో కూడా అతణ్ణి సర్వజ్ఞుడిగా ఇలా చెప్పబడింది "*ఋషి ప్రసూతం కపిలం యస్తమగ్రే, జ్ఞానైః బిభర్తి జాయమానం చ పశ్యేత్*" (ఎవరు సర్వజ్ఞుడైన కపిలుని సృష్టించి, అతనిలో సర్వ జ్ఞానములు నింపి పోషించాడో, ఆ సర్వేశ్వరుణ్ణి చూడాలి – శ్వే.ఉ 5.2). ఇంతటి జ్ఞాన సంపన్నుడైన కపిలముని సిద్ధాంతం నిరాకరించబడదు. అదీకాక, ఈక్షత్యాది కారణాల చేత పరమేశ్వర సంకల్పం, కోరిక ప్రకారమే జగత్సృష్టి జరిగిందని నిర్ణయించి మళ్లీ ఈ ప్రసంగం చెయ్యవలసిన అవసరం ఏముంది?

సిద్ధాంతం:

కపిలాదులు ఈశ్వరకారణత్వాన్ని అంగీకరించలేదు. మనకు ఈశ్వర కారణత్వాన్ని ఆదరించి విధ్యుక్త ధర్మాలను విస్మరించని స్మృతులు ఎన్నో ఉన్నాయి. జన సామాన్యానికి వేదాలు అందుబాటులో లేని కారణంగా స్మృతి ప్రాచుర్యం ఎక్కువగా ఉంటుంది. అందువల్ల స్మృతులలో చెప్పిన అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి, వాటి సామర్థ్యం చేతనే కపిలమతం ఎందుకు అంగీకార యోగ్యము కాదో పరామర్శించి నిర్ధారింపబడుతున్నది.

2. అవిరోధాధ్యాయము : ద్వితీయపాదము

ఈ పాదంలో సాంఖ్యాది సిద్ధాంతాలు నిస్సారములని సూత్రకారులు వాటిని నిరాకరిస్తున్నారు.

1. రచనానుపపత్త్యధికరణమ్

అచేతనమైన ప్రధానం లేక అవ్యక్తం జగదుత్పత్తికి ఉపాదాన కారణం అని సాంఖ్యసిద్ధాంత మూల ప్రాతిపదిక. అయితే, అచేతనమైనది జగత్కారణం కాదని ఈ ప్రకరణలో స్థాపించబడుతున్నది.

సూ: 2.2.1 రచనానుపపత్తేశ్చ నానుమానమ్

ప్రధానము వలన సృష్టి జరగదు. అందువలన అది జగత్కారణముగా అంగీకరింపబడదని సూత్రార్థం.

సంశయం:

ప్రథమాధ్యాయంలో “ఈక్షతేర్నాశబ్దమ్” అనే సూత్రంలోను (బ్ర.సూ 1.1.5), “కామాచ్చ నానుమానాపేక్షా” అనే సూత్రంలోను (బ్ర.సూ 1.1.18), “ఏతేన సర్వే వ్యాఖ్యాతా వ్యాఖ్యాతాః” అనే సూత్రంలోను (బ్ర.సూ 1.4.28) సాంఖ్యవాదుల ప్రధాన కారణ వాదాన్ని తిరస్కరించారు కదా మళ్లీ ఈ చర్చ ఎందుకు?

End of Preview.

Rest of the book can be read @

http://kinige.com/book/Brahmasutramulu+Ramakrishna+Matham

* * *